

## గ్రామాభివృద్ధిలో అంగన్‌వాడీలు కీలకం

**ప్రజానావ, తాండూర్:** గ్రామ అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ ముదాం వనజ గోవర్ధన్ అన్నారు. మండలంలోని కాసిపేటలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏఎల్ఎంసీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీల ఆరోగ్యం కోసం పోషకాహారం ఎంతో అవసరమన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఉప సర్పంచ్ బోయిని సుమలత శ్రీనివాస్ లు బాలింతలు, గర్భిణీలకు కోడిగుడ్లు, పాలు, బియ్యం, పప్పు, నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జి.స్వర్ణలత, కే.శారద, తల్లులు, పిల్లలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించాలి



**ప్రజానావ, తాండూర్:** వార్డు సభ్యులు శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధి దిశగా సమర్థంగా పనిచేయాలని బెల్లంపల్లి డిఎల్పిఓ డి. సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం కొత్తపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని, గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, ట్రైనర్స్, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫులో మందమర్రి విద్యార్థుల ప్రతిభ



**ప్రజానావ, మందమర్రి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఈనెల 8న జరిగిన 5వ రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫు పోటీల్లో మందమర్రి విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. సోమవారం మందమర్రి సింగరేణి స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో స్థానిక ఎస్సై నరేష్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని సూచించారు. చిన్న వయసు నుంచే లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించే వరకు నిరంతరం కృషి చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కుంగ్ ఫు, కరాటే వంటి క్రీడలు ఆత్మరక్షణకు ఒక ఆయుధమని తెలిపారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**ప్రజానావ, కౌటల:** క్రీడలు యువతను సన్మార్గంలో నడిపిస్తాయని, యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ అన్నారు. మండలంలోని బాలేపల్లి గ్రామంలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నిమెంట్ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలు, రన్నర్-అప్ జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దారుఢ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బండు పటేల్, నాయకులు రాంటెకి నవీన్, కనికి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అభిలా, తాటినగర్ సర్పంచ్ అనిల్, టోర్నిమెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అంబర్‌పేట్‌లో రివాల్వర్ కలకలం

- భార్య హత్యకు కుట్ర భగ్నం!
- వాహన తనిఖీల్లో దొరికిపోయిన నిందితుడు..
- తుపాకీ, ఆరు తూటాలు స్వాధీనం
- బీహార్ నుంచి ఆయుధాల సరఫరా..
- మరో ఇద్దరు నిందితుల అరెస్ట్



**ప్రజానావ, ఖైరతాబాద్:** నగరంలోని అంబర్‌పేట్ పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఘోర నేరం వెలుగులోకి వచ్చింది. కారులో అక్రమంగా తరలిస్తున్న దేశీయ రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఒక పెను ప్రమాదాన్ని అడ్డుకున్నారు. తన రెండో భార్యను హతమార్చాలనే పక్కా పథకంతో నిందితుడు ఆయుధాన్ని తరలిస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంబర్‌పేట్ పోలీసులు సోమవారం రాత్రి సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మల్కాజిగిరికి చెందిన అరుణ్ కుమార్ ప్రయాణిస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీని పరిశీలించగా అందులో ఒక దేశీయ తుపాకీ, 6 తూటాలు లభించడంతో పోలీసులు విస్తుపోయారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.

### బీహార్ నుంచి దిగుమతి

నిందితుడు అరుణ్ కుమార్‌కు తన రెండో భార్యతో గొడవలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతో, ఎలాగైనా హతమార్చాలని కుట్ర పన్నాడు. ఇందుకోసం బీహార్ నుంచి తుపాకీని తెప్పించినట్లు నిందితుడు అంగీకరించాడు. అరుణ్ కుమార్‌కు ఆయుధాన్ని సరఫరా చేయడంలో సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులను కూడా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్, హత్యాయత్నం కుట్ర కింద కేసులు నమోదు చేశారు.

# మహిళల భద్రత, వసతికే ప్రాధాన్యం

### మంత్రి సీతక్క

### వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన



**ప్రజానావ, జూబ్లీహిల్స్:** మహిళల రక్షణ, భద్రకు ప్రభుత్వం మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 'వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్' నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, సీఎన్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సొంత ఊళ్లను వదిలి నగరానికి వచ్చి ఉద్యోగాలు చేస్తున్న మహిళల వసతి, భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, వారి రక్షణ కోసం ప్రభుత్వం మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సామాన్యుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే ప్రభుత్వ సంకల్పానికి ఈ హాస్టల్ నిర్మాణం ఒక నిదర్శనమని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కొనియాడారు. ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## తరుణ్ హత్యకు నిరసనగా ఫిలింనగర్‌లో భారీ క్యాండిల్ ర్యాలీ!



**ప్రజానావ, జూబ్లీహిల్స్:** దేశ రాజధాని ఢిల్లీలో హోలీ వేడుకల సందర్భంగా దళిత యువకుడు తరుణ్ కుమార్‌ను మతోన్మాద మూకలు దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు బాలిశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఫిలింనగర్‌లో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఫిలింనగర్ ఏబీఎన్ న్యూస్ ఛానల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మహనీయుల విగ్రహాల వరకు తీశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అమర్నాథ్ సారంగుల, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడిగారి భోజి రెడ్డి పాల్గొని మాట్లాడారు. హోలీ పండుగ వేళ ఒక నిరుపేద దళిత యువకుడిని అకారణంగా లక్ష్యంగా చేసుకుని చంపడం అత్యంత బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇలాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకోవడం సభ్య సమాజానికి గొడ్డలిపెట్టు అని, మతోన్మాద శక్తులను అణచివేయడానికి హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. తరుణ్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శీతల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శులు దొంగరి రాజకళ, గుంటి ఆనంద్ సాగర్, చెలిమిటి గిరి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**గుడిహత్నూర్:** మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్ కోరారు. మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రితో చర్చించారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి గుడిహత్నూర్ మండల అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



## తెలంగాణపై విషం చిమ్మితే మసైపోతారు!

### ఆంధ్రా ఎంపీల తీరుపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం

### ఏపీకి 'ప్రత్యేక హోదా' అడిగే దమ్ములేక.. తెలంగాణపై ఏడుపా?

**ప్రజానావ, ఖైరతాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి 12 ఏళ్లు గడుస్తున్నా, ఇంకా ఈ ప్రాంతంపై ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఏడుపుగొట్టు రాజకీయం చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రా ఎంపీల తీరుపై నిప్పులు చెరిగారు. "కోతికి పుండు అయితే గోకినట్టు" మీ వ్యవహారం తయారైందని, మానిన గాయాలను రేపాలని చూస్తే తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన 'ప్రత్యేక హోదా' గురించి ఢిల్లీ పెద్దల దగ్గర అడిగే మొఖం లేక, అక్కడ మోకరిల్లి.. ఇప్పుడు తెలంగాణపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో వందలాది మంది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైంది మీ కుట్రలు కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవాలని చూసిన 'సైంధవులు' మీరేనంటూ విమర్శించారు. కృష్ణా జలాల్లో ఆంధ్రా సాగిస్తున్న నీటి దోపిడీని ఎండగడతామని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. పార్లమెంట్‌లో లావు కృష్ణదేవరాయలు వంటి ఎంపీలు తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే.. ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నోరు మెదపకపోవడంపై దాసోజు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "తెలంగాణ గడ్డపై గెలిచిన మీరు, అక్కడికక్కడే వారిని ఎందుకు నిలదీయలేదు?" అని ప్రశ్నించారు. టీడీపీ ఎంపీలు లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ అధికారిక వైఖరా? లేక వారి సొంత పైత్యమా? అనేది చంద్రబాబు నాయుడు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి బతుకుతుంటే, మీ చిల్లర రాజకీయాల కోసం మళ్లీ చిచ్చు పెట్టాలని చూడొద్దని హెచ్చరించారు. తెలంగాణ రాజకీయాల్లో 'శిఖండి' పాత్ర పోషిస్తూ ఇక్కడి అభివృద్ధిని అడ్డుకుంటున్న వారి బండారం బయటపెడతామన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకాలని చూస్తే మాడి మసైపోతారని, అనవసరంగా మానిన గాయాలను రేపొద్దని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు.

